
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 22, ఏప్రిల్, 2024



సోమశిలలో 8.45 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 8.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.76,050
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,811
3శాతం జీఎస్టీతో	రూ.7,015
నవర (8గ్రాములు)	రూ.56,120



డ్రైవర్ నిర్లక్ష్యంతో బేజారు

డ్రైవర్ లేకుండానే లారీ పరుగులు తీసిన ఘటన నెల్లూరులోని కనుపర్తిపాడు వద్ద చోటుచేసుకుంది. ఘటనతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. 8లో

న్యూస్‌రీల్

అలరించిన కవి సమ్మేళనం



నెల్లూరు(బృందావనం): నెల్లూరు కీర్తి ప్రదాతల స్ఫూర్తిని చాటుతూ నగరంలోని పురమందిర ప్రాంగణంలో గల వర్ధమాన సమాజ మందిరంలో కవి సమ్మేళనాన్ని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు తమ కవితలతో నెల్లూరు కీర్తి ప్రదాతల సేవలు, త్యాగాలను వివరించారు. ముఖ్యఅతిథిగా కవి చిన్ని నారాయణరావు హాజరయ్యారు. అనంతరం కవులను ఘనంగా సత్కరించారు. పెనాక సుజాతరెడ్డి, ఇప్పగుంట శివకుమార్‌రెడ్డి, దోనిపూడి కేశవనారాయణ మూర్తి, ప్రసన్నలక్ష్మి, రేఖారాణి, డాక్టర్ మారం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కసుమూరు దర్గాలో సుమన్ ప్రార్థనలు



వెంకటాచలం: మండలంలోని కసుమూరు దర్గాను ప్రముఖ సినీ నటుడు సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ముజావర్లు ఘన స్వాగతం పలికారు. దర్గాలో ప్రార్థనల అనంతరం కసుమూరు కొండపై ఉన్న తాజుద్దీన్ బాబా నిషాన్‌ను దర్శించుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ దాఖలుకు గడువు పొడిగింపు

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను దాఖలు చేసే గడువును ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించారని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడారు. వారు పని చేస్తున్న రిటర్నింగ్ అధికారి పరిధిలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఫారం – 12ను పూర్తి చేసి అక్కడే సమర్పించాలని కోరారు. మార్గదర్శకాలను రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం రాత్రి జారీ చేసిందని, దీనికి అనుగుణంగా అర్హులైన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసే వెసులుబాటును కల్పించాలని కోరారు.

నేత్రపర్వంగా కల్యాణం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాథ స్వామి దేవస్థానంలో రంగడు, రంగనాయకి అమ్మవార్లకు పంగున్యోత్తర కల్యాణాన్ని వేడుకగా ఆదివారం నిర్వహించారు. తిరుమంజనం, స్థలపురాణ పఠనం, కాశీయాత్ర, ప్రాకారోత్సవం, ఎదురుకోలు ఉత్సవాలను జరిపారు. ఉభయకర్తలుగా మంకు జానకమ్మ ఎండోమెంట్ నుంచి దేవస్థానం వ్యవహరించింది. ఏర్పాట్లను ఈఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

నిబంధనలకు తిలోదకాలు

- ఎన్నికల ప్రచారంలో చౌక దుకాణ డీలర్లు

నెల్లూరు(పొగతోట): ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి కొంత మంది చౌక దుకాణ డీలర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. టీడీపీ నేతలతో కలిసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాలుపంచుకుంటున్నారు. అధిక శాతం మంది డీలర్లు ఈ రకంగా వ్యవహరిస్తున్నా, చర్యలు తీసుకునే వారే కరువయ్యారు. డీలర్ల సంఘ నేత తన సహచరులను టీడీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వద్దకు ఇటీవల తీసుకెళ్లారు. తమ సమస్యలను పరిష్కరిస్తే మీకు అండగా నిలుస్తామనే ఆఫర్‌ను సైతం ఇచ్చారని సమాచారం. వేమిరెడ్డి హామీతో డీలర్లు ఈ రకంగా ప్రచారం చేస్తూ ఎన్నికల సంఘ నిబంధనలను అతిక్రమిస్తున్నారు. వీరిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బ్రో.. నువ్వింత సామాన్యుడివా..?



రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇసుక రీచ్‌ల నుంచి నెలవారీ మామూళ్లు.. దుకాణాలను ఏర్పాటు చేయాలంటే ముడుపులు.. ఇలా గడిచిన ఐదేళ్లలో నగరాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిండిచేశారు. వీటి ద్వారా ఆయన భారీగా గడించి.. పెద్ద మొత్తంలో వెనుకేసుకొని ఉంటారనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలుపొంది.. మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఆయన తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాలను చూస్తే అయ్యో.. ఆయన ఇంత సామాన్యుడా అనే భావన అందరిలో కలుగుతోంది. చివరికి కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో తన మందీమార్బాలన్ని పెంచి పోషించే కార్యాలయం.. మాగుంట లేఅవుట్లోని భారీ భవంతి సైతం తనది కాదని అఫిడవిట్‌లో పొందుపర్చడంతో మా శ్రీధరన్న పెద్ద కమల్‌హాసనేనండోయ్ అని రూరల్ ప్రజలు చమత్కరిస్తున్నారు.

బెదిరింపులు, ముడుపులతో భారీగా ధనార్జన

- అయితే ఆస్తులు మాత్రం రూ.2.45 కోట్లేనంట..!
- నివాసం ఉండే భవంతీ ఆయనది కాదు
- పార్టీ కార్యాలయం కూడా ఇతరులదే
- కోటంరెడ్డి కతలు చూతమురారండి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా పదేళ్ల పాటు సాగి.. తాజాగా నిర్వహించనున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేయనున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తనను తాను అతి సామాన్యుడిగా ప్రకటించేసుకున్నారు. ఎన్నికల సందర్భంగా పొందుపర్చిన అఫిడవిట్‌లో తన, కుటుంబ ఆస్తులను రూ.2.5 కోట్లుగా చూపారు. ఇదేందండీ.. తాను చెప్పిందే శాసనం అనే భావనలో నియోజకవర్గంలో ఇన్నాళ్ల పాటు అరాచకాలు సృష్టించిన ఆయన ఆస్తులు ఇంతేనాననే అనుమానంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. వాస్తవానికి ఆయన ఆస్తులు ఇంకా తక్కువ ఉండొచ్చని పకాపకా నవ్వుకుంటున్నారు.

వ్యాపారం చేస్తారు.. కానీ ఆస్తులు కూడబెట్టుకోరు..!

రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేస్తారే గానీ ఆస్తులను పెద్దగా కూడబెట్టుకోలేదంట. బ్యాంక్ బ్యాలెన్స్ లేకపోవడంతో.. అప్పుల ద్వారా పొందిన మొత్తంతో ఎన్నికల కార్యక్షేత్రంలోకి దిగిన ఆయనపై జాలికలగక మానదు.

ఇసుక రీచ్‌లతో రిచ్

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం, గొల్లకందుకూరు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉండేవి. ఈ తరుణంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తమ అనుచరులతో కలిసి ఇసుక రీచ్‌లలో అక్రమాలకు తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను కొల్లగొట్టారు. అడ్డొచ్చిన అధికారాలను సైతం భయభ్రాంతులకు గురిచేశారు. వీరి ఆగడాలకు భయపడి రీచ్‌ల వద్దకు రావాలంటేనే బయటి వ్యక్తులు భయపడేవారు. ప్రభుత్వ అనుమతులున్నా, వీరి అనుమతుల్లేకపోతే బస్తా ఇసుక సైతం బయటకు వెళ్లేది కాదు. ఇలా ఇసుక రీచ్‌ల పుణ్యమానని మా శ్రీధరన్న చాలా రిచ్ అయ్యారనే టాక్ నియోజకవర్గంలో ఎప్పటి నుంచో నడుస్తోంది.

కోటం కా..హుకుం

నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. ఫలితంగా వాణిజ్య భవనాలు, షాపింగ్ మాల్స్, వస్త్ర, వజ్ర దుకాణాలు వెలుస్తున్నాయి. వీటితో పాటు చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేయాలన్నా కోటంరెడ్డి అండ్ కో పర్మిషన్ తప్పనిసరి. షాపింగ్‌మాల్స్, వాణిజ్య భవనాలను ప్రారంభించాలంటే పేద శ్రీధర్‌రెడ్డికి నగదు సమర్పించాల్సిందే. ఇచ్చేందుకు ఎవరైనా అంగీకరించకపోతే వేధింపులు తప్పవు. ఇలా భారీగా కూడబెట్టుకున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సామాన్యుడంటే అంగీకరించక తప్పదు.

భారీ భవనంలో ఉంటా.. కానీ అది నాది కాదు



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నివాసం



కార్యాలయం

నెల్లూరులో సుసంపన్నమైన మాగుంట లేఅవుట్లో పెద్ద భవంతిని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్మించుకున్నారు. మరోవైపు తన అనుచర వర్గాన్ని పెంచి పోషించేందుకు కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో సువిశాలమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇవేవీ తనకు గానీ.. తన కుటుంబానికి గానీ చెందినవి కావని కోటంరెడ్డి ప్రకటించుకున్నారు. ఈ తరుణంలో మా శ్రీధరన్న నిజమైన సామాన్యుడు అని ఆయన అభిమానులు సంబరపడుతున్నారు.

రూ.2.45 కోట్ల ఆస్తులు.. రూ.16.9 లక్షల అప్పు

- తన ఆస్తులు మొత్తాన్ని రూ.2.45 కోట్లుగా అఫిడవిట్‌లో చూపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటానని.. బెంగళూరు నగరంలో రెండు ఫ్లాట్లు, టయోటా ఫార్ట్యూనర్ కారు, 136.84 గ్రాముల బంగారు ఆభరణాలు కలిపి స్థిర, చరాస్తులు సుమారు రూ.1.2 కోట్లుగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.
- భార్య సునందమ్మ వ్యాపారం చేస్తారని.. ఆమెకు నెల్లూరు రామ్‌జీనగర్‌లోని రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్.. సంగం మండలం వెంగారెడ్డిపాళెంలో 1.74 సెంట్ల భూమి, టయోటా ఇన్నోవా కారు, 723.07 గ్రాముల బంగారు ఆభరణాలతో కలిపి రూ.1.24 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని అఫిడవిట్‌లో పొందుపర్చారు.
- వీరికి రూ.16.9 లక్షల అప్పు ఉందని చూపారు.

లేఅవుట్ వేస్తున్నారా.. ఆయన్ను కలవండయ్యా..!

రూరల్ నియోజకవర్గంలో లేఅవుట్‌ను ఎవరు వేసినా శ్రీధర్‌రెడ్డిని కలవాల్సిందే. ఆయన సూచనల మేరకు ఎకరాల వంతున ట్యాక్స్ చెల్లించాలి. ఈ ట్యాక్స్ అంటే ప్రభుత్వానికి కాదండోయ్.. సామాన్యుడిగా చెలామణీ అయ్యే శ్రీధర్‌రెడ్డికి ముట్టజెప్పాలి. అది కాకపోతే లేఅవుట్లో నాలుగైదు ప్లాట్లు ఇచ్చి.. తాను చెప్పిన వారి పేర్లపై రిజిస్ట్రేషన్ చేయాల్సిందే. లేఅవుట్లు వేసే సమయంలో ప్రభుత్వ నిబంధన మేరకు పార్కుల కోసం స్థలాన్ని ఏ విధంగా కేటాయించాలో అదే విధంగా తనకూ కొన్నింటిని ఇవ్వాలనే షరతును కోటంరెడ్డి విధించారంటే ఆయన ఎంత సామాన్యుడో అర్థం చేసుకోవచ్చు.

అనస్థీషియా వైద్యుల పాత్ర కీలకం



నెల్లూరు(అర్బన్): గాయపడినా.. భరించలేని నొప్పులొచ్చినా.. ఆపరేషన్ల సమయంలో వైద్యం చేసేటప్పుడు అనస్థీషియా డాక్టర్ల సేవలు ఎంతో కీలకమని హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల అనస్థీషియా విభాగ డాక్టర్లు, పీజీ వైద్య విద్యార్థులకు శిక్షణను మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏసీఎల్ఎస్ బృందం ఆదివారం నిర్వహించారు. రోగి పరిస్థితిని బట్టి చేయాల్సిన వైద్య విధానాలను వివరించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవి మాట్లాడారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తర్వుల మేరకు పీజీ వైద్య విద్యార్థులు ఇలాంటి శిక్షణకు హాజరై తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. వచ్చే నెల నుంచి ఇక్కడే తరగతులను నిర్వహించి సర్టిఫికెట్‌ను అందజేస్తామని వివరించారు. అనస్థీషియా విభాగాధిపతి శ్రీనివాసరావు, శిక్షణ ఇన్‌స్ట్రక్టర్స్, డాక్టర్లు శ్రీలత, పావని, ఆదిత్యప్రదీప్, కో ఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకులం.. ఆశీర్వదించండి

- పేదల ప్రతినిధులుగా బరిలో ఉన్నాం
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



రోడ్‌షోలో ప్రజలకు నమస్కరిస్తున్న విజయసాయిరెడ్డి, పక్కన ప్రసన్నకుమార్‌రెడ్డి



జేజేలు పలుకుతున్న జనాలు

కోవూరు: రానున్న ఎన్నికల్లో పేదల ప్రతినిధులుగా తాను, ప్రసన్నకుమార్‌రెడ్డి బరిలో ఉండగా.. పెత్తందారుల పక్షాన టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు పోటీ చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇనమడుగులో ఆదివారం నిర్వహించిన రోడ్‌షోకు విజయసాయిరెడ్డి, పార్టీ కోవూరు అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి హాజరయ్యారు. వీరికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. ఈ ఎన్నికలు క్లాస్ వార్ కాదు.. క్యాష్ వార్ అని పొదలకూరులో నిర్వహించిన సభలో చంద్రబాబు వ్యాఖ్యానించారని, అయితే ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు టీడీపీ అభ్యర్థి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తానంటున్న అంశాన్ని ప్రస్తావించారు. వ్యాపారవేత్తలు, ధనవంతులు ప్రజాప్రతినిధులు కాలేరని.. ప్రజాసమస్యలను పరిష్కరించి ప్రజాభిమానాన్ని చూరగొన్న వారే ఆ స్థానాన్ని అధిరోహించగలరని చెప్పారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నల్లపరెడ్డి కుటుంబమే ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించనుందని చెప్పారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను హేళన చేస్తున్న టీడీపీ కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డిని ఇంటికి సాగనంపాలని కోరారు. సంక్షేమ పథకాలతో ప్రజలను సోమరులను చేస్తున్నారంటూ వ్యాఖ్యలు చేసి తన మైండ్‌సెట్‌ను ఆమె బయటపెట్టుకున్నారని చెప్పారు.

ఇనమడుగులో సంక్షేమానికే రూ.45 కోట్లు

ఇనమడుగులోని రెండు సచివాలయాల పరిధిలోని ప్రజల సంక్షేమానికి దాదాపు రూ.45 కోట్లను ప్రభుత్వం వెచ్చించిందన్నారు. ఇనమడుగులోని ఎనిమిది కాలనీల్లో రూ.65 లక్షలతో డ్రెయిన్లు.. రూ.79 లక్షలతో 1.25 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో బడుగు, బలహీనవర్గాలే ఎక్కువగా లబ్ధి పొందాయని పేర్కొన్నారు.

ప్రశాంతిరెడ్డి వ్యాఖ్యలు విడ్డూరం

కోవూరు నియోజకవర్గంలో నల్లపరెడ్డి కుటుంబీకులు 11 సార్లు పోటీచేస్తే తొమ్మిదిసార్లు ప్రజలు గెలిపించారని ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని చెప్పారు. అయితే నియోజకవర్గం అభివృద్ధి చెందలేదనే ప్రశాంతిరెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ఉన్నత పదవులు పొంది ఆయనకు వేమిరెడ్డి దంపతులు నమ్మకద్రోహం చేశారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వీరికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఓటర్లకు రూ.ఐదు వేలైనా ఇచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి.. ఎమ్మెల్యేగా తనను.. ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. వసంత్‌కుమార్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మీరారెడ్డి, చరణ్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ విష్ణు, సు. దీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ గళం మాకొద్దు మహాప్రభో..!

- బాబు ప్రసంగాన్ని పట్టించుకోని ప్రజలు
- సమయానికి జనాలు రాక తుస్సుమన్న ప్రజాగళం సభ
- నవ్వులపాలైన టీడీపీ



ప్రజాగళం సభకు పలుచగా హాజరైన జనాలు

పొదలకూరు: ప్రజాగళం పేరిట చంద్రబాబు వినిపించే గళాన్ని ప్రజలు తిరస్కరించారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న టీడీపీ.. పొదలకూరులో ప్రజాగళం పేరిట సభను నిర్వహించి మరింత పలుచబడింది. సమయానికి అద్దె జనాలు హాజరుకాక సభ అట్టర్‌ఫ్లాప్‌పై టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి మరింత నష్టపోవాల్సి వచ్చిందని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ సభతో లాభం కంటే జరిగిన నష్టమే ఎక్కువని పార్టీ శ్రేణులు గుసగుసలాడుకుంటున్నాయి.

వాట్ ఈజ్ దిస్ సోమిరెడ్డీ..?

వాస్తవానికి గూడూరులో సభను శనివారం ముగించిన అనంతరం షెడ్యూల్ ప్రకారం పొదలకూరులో ప్రజాగళం సభను మధ్యాహ్నం 2.30కు చంద్రబాబు నిర్వహించాల్సి ఉంది. అయితే మూడు గంటలకూ జనాల్లేక రామ్‌నగర్ గేట్ సెంటర్ నాలుగు రోడ్ల కూడలి వెలవెలబోయింది. దీనిపై సమాచారం అందుకున్న చంద్రబాబు గూడూరులో ఆలస్యంగా బయల్దేరి పొదలకూరు వచ్చారు. గేట్ సెంటర్‌కు సమీపంలోని మర్రిపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ఆయన విషయాన్ని తెలుసుకొని సోమిరెడ్డిపై అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. ఫలితంగా జన్మదినం పేరిట హెలిప్యాడ్ వద్దే ఇరవై నిమిషాలు గడపాల్సి వచ్చింది.

సభ ప్రారంభం.. జారుకున్న జనాలు

జనాలు ప్రత్యేక వాహనాల్లో రావడంతో సభను ప్రారంభించారు. చంద్రబాబు ప్రసంగం అందుకోవడంతోనే జనాలు మెల్లగా జారుకున్నారు. ఆయన ప్రసంగం ఆద్యంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణిని దూషించడంతోనే సరిపోయింది. ఆకట్టుకునే ప్రసంగం లేక ప్రజలు పలాయనం చిత్తగించారు.

అంచనాలు తారుమారు

పొదలకూరులో ప్రజాగళం సభకు జనాలు పోటెత్తుతా రని టీడీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో డబ్బులిచ్చి జనాలను తరలించా రు. పొదలకూరు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, చంద్రబాబును తీసుకొస్తే నష్టాన్ని కొంతమేరైనా నివారించొచ్చని సోమిరెడ్డి అంచనా వేశారు. అయితే ఆయన ఆశలు తారుమారయ్యా యి. కాకాణికి భయపడి జనాలు రాలేదంటూ కవర్ చేసుకునేందుకు సోమిరెడ్డి విఫలయత్నం చేశారు.

తాగాలి.. తాగి తెగ తూగాలి..!

గ్రామాల్లో కూలీ పనులు చేసుకునే వారికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ముట్టజెప్పి వాహనాల్లో సభ కు తరలించారు. అయితే నేతలు ఆశించిన స్థాయిలో జనాలు రాలేదు. ఈ విషయమై సోమిరెడ్డిపై అసహనం వ్యక్తం చేయడంతో పాటు జనాలను వేగంగా రప్పించాలంటూ చంద్రబాబు కోప్పడ్డారని సమాచారం. నగదుతో పాటు బిరియానీ ప్యాకెట్లు అందజేయడంతో తమ్ముళ్లు రోడ్లపైనే తాగి ఊగిపోయారు.

ప్రజాగళానికి ఆదరణేదీ..?

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): టీడీపీ అధినేత చంద్రబాబు పొదలకూరులో నిర్వహించిన ప్రజాగళం సభ అట్టర్‌ఫ్లాపైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సభకు 1500 మంది హాజరు కాగా, ఆయన మాట్లాడే సమయానికి 300 మంది కూడా లేరని చెప్పారు. సర్వేపల్లికి చంద్రబాబు చేసిందేమీలేదని, అందుకే సభలో ఏమీ చెప్పలేకపోయారని విమర్శించారు. తనపై ఆయన మోపిన అభియోగాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోర్టును కోరేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. చంద్రబాబుపై వచ్చిన అభియోగాలపై సీబీఐ విచారణ కోరే ధైర్యం ఉందానని సవాల్ విసిరారు.

పోటీకి ఎవరూ రాకే ఆయనకు టికెట్..!

సర్వేపల్లిలో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చివరికి సోమిరెడ్డికే ఇచ్చారని ఎద్దేవా చేశారు. వ్యవసాయంపై చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా తాను రైతుల సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టానని తెలిపారు. ప్రస్తుతం పుట్టి ధాన్యం ధర రూ.22 వేలకుపైగా ఉందని.. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల్లో లభిస్తున్నాయని తెలిపారు.

దోచుకునేందుకే సోమిరెడ్డి పరిమితం

మంత్రిగా సోమిరెడ్డి పనిచేసిన కాలంలో రైతులను దోచుకున్నారని ఆరోపించారు. కావలిలో చెక్‌పోస్టను ఏర్పాటు చేసి.. ఇతర జిల్లాల నుంచి ధాన్యం లారీలు వస్తే వాటిని ఆపి కేసులను సోమిరెడ్డి పెట్టించిన అంశాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం పక్క రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి రైస్‌మిల్లర్లు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఒకరిద్దరు నేతలు వెళ్లినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదని, ప్రజాదరణ తమ పార్టీకే ఉందని స్పష్టం చేశారు. సర్వేపల్లిలో కేజీఎఫ్ అని చంద్రబాబు వ్యాఖ్యానించారని, తాను చేసిన అభివృద్ధిని చూపిస్తానని చెప్పారు. సోమిరెడ్డి ఇచ్చిన స్క్రిప్టునే చంద్రబాబు చదివారని విమర్శించారు. పొదలకూరు సభకు ప్రజలు రాకపోతే తాను ఆపానని చంద్రబాబు పేర్కొన్నారని మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సభలు, బస్సు యాత్రకు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారని, ఆయన్ను ఎంత ఆరాధిస్తున్నారో దీని ద్వారా తెలుస్తోందన్నారు. కోర్టులో ఫైళ్ల చోరీపై సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిన అంశాన్ని ప్రస్తావించారు. జిల్లాలో టీడీపీకి ఒక్క సీటూ రాదని చెప్పారు. తాను విసిరిన సవాల్‌కు చంద్రబాబు 24 గంటల్లో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు.

పదో తరగతి ఫలితాల విడుదల నేడు

నెల్లూరు(అర్బన్): పదో తరగతి పరీక్ష ఫలితాలను విజయవాడలో సోమవారం విడుదల చేయనున్నారని డీఈఓ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో దాదాపు 34 వేల మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు. results. bse. ap. gov. inలో ఫలితాలను చూడొచ్చని పేర్కొన్నారు.

రూ.6.19 లక్షల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు విస్తృత తనిఖీలను చేపట్టారు. సంతపేట పరిధిలో రూ.1,89,700, కావలి రూరల్ పరిధిలో రూ.1,79,500, గూడూరు పరిధిలో రూ.1.4 లక్షలు, రాపూరు పరిధిలో రూ.1,09,800 నగదును ఎలాంటి రసీదుల్లేకుండా అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- కందుకూరు పరిధిలో పేకాట కేంద్రంపై దాడి చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.40,320ను సీజ్ చేశారు.
- సైదాపురం పరిధిలో 22, వేదాయపాళెంలో 14, ఉదయగిరి, వింజమూరులో 12 చొప్పున, దుత్తలూరులో ఏడు, చేజర్లలో 10, కలువాయి, టీపీగూడూరులో 15 చొప్పున, కండలేరులో 20, ఏఎస్‌పేటలో ఆరు మద్యం సీసాలను పోలీసులు.. ఎస్‌ఈబీ అధికారులు 420 బాటిళ్లను సీజ్ చేశారు.
- 110 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.


దోశ వేస్తున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో ఖలీల్ అహ్మద్


సంక్షేమ పథకాలను వివరిస్తున్న సునందారెడ్డి


వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న కాకాణి కుమార్తె పూజిత


వృద్ధురాలితో మాట్లాడుతున్న హిమబిందు

ప్రజలతో మమేకమై..

వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ ఆదివారం 53వ డివిజన్‌లో ప్రచారం చేశారు. ప్రజలతో మమేకమై యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఓ ఇంటి ఆవరణలో పెట్టుకున్న చిన్నపాటి టిఫిన్ సెంటర్లో విజయసాయిరెడ్డి దోశలు వేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యేగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె పూజిత మనుబోలులోని చంద్రమౌళి నగర్, బీసీ కాలనీ, తూర్పుసంగం, సంజీవయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. నెల్లూరు రూరల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె హిమబిందు ఒకటో డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి నగరంలోని 11వ డివిజన్‌లో ముమ్మరంగా ప్రచారం చేశారు. కరపత్రాలు అందజేసి వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని ప్రజలు తెలిపారు.

– నెల్లూరు ఫొటోగ్రాఫర్/మనుబోలు/ నెల్లూరు సిటీ/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

ప్రచార పర్వం

క్లుప్తంగా

జిల్లా వాసులకు పార్టీ పదవులు


మన్నెమాల సుకుమార్‌రెడ్డి


ఆనం జయకుమార్‌రెడ్డి


కర్తం ప్రతాప్‌రెడ్డి


సమీర్‌ఖాన్

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ పదవుల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యాలయం ఆదివారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర సెక్రటరీలుగా కర్తం ప్రతాప్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తాళ్లూరు రాము, క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర కమిటీ సెక్రటరీగా పల్లాపు జాన్ భాస్కర్, మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీలుగా నిడిగుంట అరుణ, వెంకటాచలం హిమబిందు, కామాక్షిదేవి, యువత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా పఠాన్ సమీర్‌ఖాన్, రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా పేర్నాటి కోటేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆనం జయకుమార్‌రెడ్డి, సెక్రటరీలుగా వి.చంద్రశేఖర్, చీదల ఎం.కిషన్, సిద్ధన సుబ్బారెడ్డి, దొంతలి రఘురామయ్య, సయ్యద్ ఖాజారంతుల్లా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మాదాల వెంకటశ్యామ్‌ప్రసాద్, ఐటీ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిలానీబాషా సయ్యద్, సెక్రటరీగా పొన్నాలూరు వెంకట హరీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా మనోజ్, యువత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొన్నాడి చంద్రశేఖర్‌రావు నియమితులయ్యారు.

హైవేపై తప్పిన ప్రమాదం

నెల్లూరు(క్రైమ్): కంటైనర్ ఇంజిన్‌ను రన్నింగ్‌లో ఉంచి డ్రైవర్ సమీపంలోని పండ్ల దుకాణానికి వెళ్లాడు. ఈ సమయంలో ఆ వాహనం ముందుకు దూసుకెళ్లింది. దీనిని గమనించిన స్థానికులు కంటైనర్‌ను ఆపేందుకు శతవిధాలా ప్రయత్నించారు. చివరకు అది జాతీయ రహదారిపై రెయిలింగ్‌ను ఢీకొని ఆగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన ఆదివారం కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు సమీప జాతీయ రహదారిపై నెల్లూరు వైపు రహదారిపై చోటుచేసుకుంది. అందరూ టెన్షన్ పడగా డ్రైవర్ మాత్రం తాపీగా జామకాయలు కవర్‌తో కంటైనర్ వద్దకు వచ్చాడు. అతడిపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 167



నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.78
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

చంద్రబాబు హామీలను నమ్మొద్దు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కాకాణి, చిత్రంలో నాయకులు

తోటపల్లిగూడూరు: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చంద్రబాబు ఇస్తున్న హామీలను ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని వరిగొండ పంచాయతీలో కాకాణి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 సంవత్సరంలో చంద్రబాబు కూటమి కట్టి అనేక హామీలిచ్చాడన్నారు. రైతు, పొదుపు రుణాల మాఫీ అన్నాడు. ఇంటికో ఉద్యోగమిస్తానన్నాడు. నిరుద్యోగ భృతి హామీ ఇచ్చాడు. కానీ ఏవీ నెరవేర్చలేదన్నారు. ఈసారి కూడా బీజేపీ, జనసేనతో కూటమి కట్టి ఇష్టానుసారంగా హామీలిస్తున్నట్లు చెప్పారు. వారిని నమ్మితే నట్టేట ముంచేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచిందన్నారు. పెట్టుబడి సాయం చేసిందన్నారు. ఆర్బీకేలు పెట్టినట్లు చెప్పారు. చేయూత, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వాహనమిత్ర, లా నేస్తం, కాపు నేస్తం, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా సీఎం జగన్ పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు ఇప్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మీ కుటుంబంలో మేలు జరిగితేనే నాకు ఓటు వేయాలని ధైర్యంగా చెబుతున్న జగన్‌మోహన్‌రెడ్డి కావాలో.. హామీలను నెరవేర్చకుండా ఎగ్గొట్టే చంద్రబాబు కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే రాక్షసపాలనే

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


ఎన్నికల ప్రచారంలో నాయకులు, చిన్నారులతో రామిరెడ్డి

కావలి: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేదలందరికీ అండగా నిలిచారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాక్షసపాలన సాగుతుంది. ప్రజలు ఆలోచించుకోవాలి' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 19, 18, 22, 23, 26, 25 వార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తాడని చెప్పారు. అబద్ధాలు చెప్పి అధికారం దక్కించుకోవాలని ఆయన ఆరాటపడుతున్నాడన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. పథకాలను కులమతాలు, పార్టీలకు అతీతంగా అందించినట్లు చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను పెట్టి ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలనను తీసుకెళ్లారన్నారు. వన్స్‌మోర్ జగనన్న అంటూ మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఎదుర్కొనే దమ్ములేక అంతమొందించాలని చంద్రబాబు ప్రయత్నించాడన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, షేక్ అబ్దుల్లా, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరోనా కాలంలో సొంత నిధులతో సేవ చేశా

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు సిటీ: 'కరోనా కాలంలో నా సొంత నిధులతో ప్రజలకు సేవ చేశా. అన్ని వర్గాలకు అండగా నిలిచా' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్‌లోని పొట్టేపాళెం గ్రామంలో ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు అనే పథకాన్ని తీసుకొస్తాడని ఎద్దేవా చేశారు. కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న సమయంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉండిపోయిన తెలుగు వారిని స్వస్థలాలకు చేర్చేందుకు సొంత నిధులు ఖర్చు చేశానన్నారు. సేవా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. రూరల్ నియోజకవర్గంలో కొందరు వ్యాపారస్తులపై దౌర్జన్యం చేశారన్నారు. తనకు అవకాశమిస్తే అలాంటి వాటికి తావు లేకుండా చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వైవీ రామిరెడ్డి, పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, వేలూరు శివసునీల్‌రెడ్డి, పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, పల్లంరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం


మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పక్కన విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవండి
- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


హాజరైన ముస్లింలు

ఉదయగిరి/మర్రిపాడు: 'దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 4 శాతం రిజర్వేషన్ కల్పించి ముస్లింల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా ఉన్నారు' అని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఆదివారం ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరా రు. చంద్రబాబు బంధువు ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడం బాధాకరమన్నారు. అలాంటి వ్యక్తులు ఉండే కూటమికి ఓటు వేస్తే నష్టం జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు సామాజికంగా, రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఉదయగిరిలో తన తమ్ముడు రాజగోపాల్‌రెడ్డిని, ఆత్మకూరులో తన కుమారుడు విక్రమ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ నియోజకవర్గాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. సమావేశంలో అభినవ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీరాపేరు వాగులో మృతదేహం

అనుమసముద్రంపేట: మండల కేంద్రంలోని బీరాపేరు వాగులో ఓ మహిళ మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. ఎస్సై ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. ఆదోనికి చెందిన పర్వీన్ (45)కు మతిస్థిమితం లేదు. ఆమెను కుమారుడు అన్వర్‌బాషా కొద్దిరోజుల క్రితం ఏఎస్‌పేట దర్గాకు తీసుకొచ్చాడు. రెండు రోజుల నుంచి ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఆదివారం బీరాపేరు వాగులో మృతదేహాన్ని చూసిన స్థానికులు దర్గా సిబ్బందికి తెలియజేశారు. వారి నుంచి విషయం తెలుసుకున్న అన్వర్ ఘటనా స్థలానికి వెళ్లి పర్వీన్‌గా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

గడ్డివాములు దగ్ధం

- రూ.5 లక్షల నష్టం



సోమశిల: అనంతసాగరం మండలం కమ్మవారిపల్లి గ్రామంలో ఆదివారం గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నలుగురు రైతులు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది, సోమశిల ఎస్సై సుబ్బారావు కొన్ని గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అప్పటికే అవి కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని చెబుతున్నారు.

కందుకూరు అభివృద్ధికి కృషి చేస్తా

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్


పోతురాజు స్వామి గుడిలో పూజలు చేస్తున్న మధుసూదన్ యాదవ్, నాయకులు

కందుకూరు: ఎన్నికల్లో తనను కందుకూరు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక 15వ వార్డులోని ఎర్రగుంటపాళెంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల జరిగిన మంచిని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు తెచ్చారన్నారు. అదే సందర్భంలో అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గలేదన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు, హాస్పిటల్స్, రోడ్లు, పాఠశాలలు, కాలేజీలు ఇలా అనేక వాటిపై శ్రద్ధ పెట్టారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. తనను ఆశీర్వదిస్తే పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగకుండా, సమాన అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు స్థానిక పోతురాజుస్వామి గుడిలో బుర్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ రఫీ, సచివాలయ కన్వీనర్లు దేవరకొండ ఆదిలక్ష్మి, హఫీజ్, నాయకులు మోసంగి వెంకటస్వామి, తానికొండ శ్రీను, షేక్ కరిమున్నీషా, దార్ల రాయుడు, తానికొండ రవి తదితరులు పాల్గొన్నారు.